సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 28 । జూన్ । 2025



మతసామరస్యానికి ప్రతీక మొహర్రం

మొహర్రం మత సామరస్యానికి ప్రతీక అని చెప్పాలి. జిల్లాలో అనేక గ్రామాల్లో మొహర్రం ను హిందువులే ముందు ఉండి జరిపిస్తారు. -8లో



రహదారి కబ్జాకు యత్నం

రాజంపేటమండలం ఊటుకూరు పంచాయతీలో శుక్రవారం పట్ట పగలు రహదారిని కబ్జా చేసేందుకు కూటమి నాయకులు ప్రయత్నించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.210	రూ.260
రెండోరకం	రూ.150	రూ.200

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1438 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా పనిచేయాలి

రాయచోటి: స్వర్ణాంధ్ర విజన్–2047 పకడ్బందీ అమలులో భాగంగా నియోజకవర్గ యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సచివాలయ సిబ్బంది పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సుపరిపాలన తొలి అడుగు, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌పై ఎంపీడీఓలు, తహసీల్దార్లు, స్పెషల్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన పది ప్రధాన సూత్రాలతో కార్యాచరణ ప్రణాళికను నిర్దేశించుకొని జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. డేటా మేనేజ్మెంట్., డేటా అనాలసిస్‌లో సచివాలయ సిబ్బంది చురుగ్గా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘా ఉండాలి



ఈవీఎం గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: జిల్లా కేంద్రంలో ఈవీఎంలను భద్రపరిచి గోదాము వద్ద 24–7 ప్రకారం నిరంతరం పటిష్ట నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీలో భాగంగా రాయచోటి పట్టణం మార్కెట్ యార్డులో ఉన్న ఈవీఎం గోదామును రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాము లోపల భద్రపరిచిన ఆయా ఈవీఎం యంత్రాలు బీయులు, సీయూలు, వీవీ ప్యాట్‌లను, అక్కడ భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అనంతరం వివిధ అంశాల గురించి రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కె మధుసూదన్‌రావు, ఆర్డీఓ ఏ శ్రీనివాస్, తహసీల్దార్ నరసింహకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గంలో అక్కులప్ప



మదనపల్లె రూరల్: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యవర్గంలో మదనపల్లెకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ బండపల్లి అక్కులప్పకు మరోసారి అవకాశం లభించింది. ఒంగోలులో ఈనెల 25, 26 తేదీల్లో రెండురోజుల పాటు జరిగిన 36వ రాష్ట్ర మహాసభల్లో అక్కులప్ప రాష్ట్ర కార్యవర్గంలోకి ఎన్నికయ్యారు. వరుసగా మూడుసార్లు రాష్ట్ర కార్యదర్శిగా సేవలందించిన ఆయనకు ఏపీయూడబ్ల్యూజేతో సుమారు మూడు దశాబ్దాల అనుబంధం ఉంది. 1996లో మొదటిసారి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన అక్కులప్ప, ఆపై జిల్లా కార్యదర్శిగా, అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఏపీయూడబ్ల్యూజేలో వివిధ హోదాల్లో పనిచేశారు. అన్నమయ్యజిల్లా నుంచి జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఉన్న అక్కులప్పను తాజాగా రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకున్నారు.

కూటమి ప్రభుత్వానికి ఉద్యోగుల సెగ

కురబలకోట: కూటమి ప్రభుత్వంపై ఏడాదికే ఉద్యోగ వర్గాల్లో తీవ్ర స్థాయిలో అసంతృప్తి సెగలు ఎగిసిపడుతున్నాయి. వివిధ శాఖల ఉద్యోగులు చుక్కలు చూపిస్తున్నారు. బదిలీల జీఓలో అస్పష్టత ఉందని ఇటీవల సచివాలయ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. తాజాగా గ్రామ కార్యదర్శులు సమస్యల పరిష్కారం కోసం శనివారం సామూహిక సెలవులో వెళుతున్నారు. పని భారం ఎక్కువ, గ్రూప్ మీట్స్ అధికం కావడం, పీజీఆర్ఎస్ పనులు,ఇతర శాఖల అధికారుల పెత్తనం, సర్వేల భారం, తీవ్రమైన పనితో వ్యాధులు బారిన పడటం, విధి నిర్వహణలో తీవ్ర వత్తిడి కారణంగా అకాల మరణాలు సంభవించడంతో పాటు వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్‌ను కలసి వినతి పత్రం ఇస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల్లో సామూహిక సెలవు కోరుతూ ఎంపీడీఓలకు గ్రామ కార్యదర్శులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కురబలకోట ఎంపీడీఓ గంగయ్యకు కూడా మండలంలోని గ్రామ కార్యదర్శులు సామూహిక సెలవులో వెళుతున్నట్లు వినతి పత్రం అందజేశారు. పాలనలో అనుభవం ఉందని చెప్పుకుంటున్న సీఎం చంద్రబాబు కూటమి ప్రభుత్వంపై వరుసగా వివిధ శాఖల ఉద్యోగులు నిరసనల పర్వం అందుకోవడం చర్చనీయాంశంగా మారింది.

ప్రకృతి ఒడిలో.. హాయివే!

శ్రీ వెంకటేశ్వరస్వామి పాదపద్మాల చెంత ఉన్న తిరునగరికి..శ్రీనివాసుని తొలిగడప కడప నుంచి ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం ఆమోదం లభించింది. జాతీయరహదారుల ప్రాధికారసంస్థ(ఎన్‌హెచ్‌ఐ) టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. 130 కిలోమీటర్ల దూరం రహదారి నిర్మాణం ఉంటుంది. దీనినే గ్రీన్‌ఫీల్డ్ హైవేగా కేంద్రం గుర్తించింది.



తిరునగరికి... గ్రీన్‌ఫీల్డ్ హైవేకు గ్రీన్‌సిగ్నల్!

- కేంద్ర నుంచి అటవీ అనుమతులు
- సురక్షిత ప్రయాణానికి కడప–రేణిగుంట ఫోర్‌లైన్
- త్వరితగతిన నిర్మాణానికి 'మిథున్'కృషి
- కడప నుంచి ఒకటిన్నర గంటలో తిరుపతికి చేరుకోవచ్చు

ఎన్‌హెచ్ రోడ్డు వివరాలు..

జిల్లా	దూరం
తిరుపతి	20కి.మీ
వైఎస్సార్,అన్నమయ్య	110 కి.మీ
అంచనా వ్యయం: రూ. 2350 కోట్లు	



ఫోర్‌లైన్ ఇలా...

- రేణిగుంట నుంచి కరకంబాడి, మామండూరు, బాలపల్లె, శెట్టిగుంట వరకు ఉన్నరహదారినే ఫోర్‌లైన్‌గా మార్చనున్నారు.
- రైల్వేకోడూరుకు ముందుభాగంలో బైపాస్ మార్గం ఏర్పాటు. ఇక్కడ నుంచి అయ్యపురెడ్డిపల్లె, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, భాకరపేట పడమరదిశగా ఫోర్‌లైన్ వెళ్లనుంది.

రాజంపేట: శేషాచలం అటవీ ప్రాంతంలో పచ్చటి ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన ప్రయాణానికి కేంద్ర అటవీశాఖ అనుమతులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దేశరాజధానిలో జరిగిన వన్యప్రాణుల జాతీయసంస్థ సమావేశంలో గ్రీన్‌ఫీల్డ్‌హైవేకు అటవీ అనుమతులు కేంద్రపరంగా ఇచ్చారు. అయితే అధికారికంగా లెటర్ కమ్యూనికేట్ కాలేదు. ఈ విషయాన్ని అటవీశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. గతంలో రహదారి 31 కిలో మీటర్ల పొడవునా, వన్యప్రాణుల సంచారం అధికంగా ఉందంటూ అటవీశాఖ అనుమతులు ఇవ్వడానికి అభ్యంతరాలను తెరపైకి తీసుకొచ్చింది. దీంతో రహదారి నిర్మాణానికి బ్రేక్ పడింది. వ్యనప్రాణుల సంరక్షణ జాతీయబోర్డు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అడవి జంతువులు రాకపోకలకు అనువుగా భూగర్భమార్గాలు (అండర్‌పాసులు) నిర్మించాలని సూచించారు. రహదారి నిర్మాణ ఆకృతుల్లో కొన్ని మార్పులు చేశారు. అందుకు జాతీయరహదారుల ప్రాధికారసంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) సమ్మతించడంతో అటవీశాఖ పచ్చ జెండా ఊపింది.

- కడప–రేణిగుంట రహదారిలో రాజంపేట, రైల్వేకోడూరులో బైపాస్ రహదారి నిర్మించాలని యోచిస్తున్నారు. ముంబై–చెన్నై రైలుమార్గం వెంబడి (పడమర వైపు)భాకరాపేట నుంచి చిన్నఓరంపాడు వరకు మార్గం నిర్మితం కానుంది. ఈమార్గం పూర్తిగా అటవీమార్గంలోనే కొనసాగుతుంది.

హైవే నిర్మాణానికి ఎంపీ మిథున్‌రెడ్డి కృషి

కడప–రేణిగుంట నేషనల్ హైవే త్వరితగతిన నిర్మాణంకు వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి కృషి చేశారు. ఫలితంగా భూసేకరణతోపాటు, మరోవైపు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. రెండేళ్లలో ఎన్‌హెచ్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నదే అభిమతంగా ఎంపీ ప్రయత్నించారు.

- ఫారెస్టుకు సంబంధించి కడప–రేణిగుంట నేషనల్ హైవేకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అనుమతులు వచ్చాయి. వైల్డ్‌లైఫ్‌కు సంబంధించి కేంద్రం నుంచి అనుమతులు రాలేదు. అనుమతులు రాగానే నిర్మాణపనులు పూర్తి చేస్తారు. అటవీ శాఖ నుంచి దాదాపు 300 హెక్టార్లు భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే తొమ్మిది మండలాల్లో 1,790.180 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగింది. అటవీశాఖ ఇప్పటికే డీమార్కేషన్, ఎన్యూమరేషన్ పూర్తి చేశారు.

ఒంటిమిట్ట, నందలూరు ప్రాంతాలకు స్పెషల్ కనెక్టివిటీ అవసరం

జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన నందలూరు, ఒంటిమిట్ట కేంద్రాలకు ఎన్‌హెచ్ నుంచి కనెక్టివిటీ రోడ్ (సర్వీసురోడ్డు) అవసరమని పలువురు భక్తులు కేంద్రాన్ని కోరుతున్నారు. పర్యాటకపరంగా ప్రాచుర్యం పొందిన ఒంటిమిట్ట, నందలూరుకు ఎన్‌హెచ్ నుంచి ప్రత్యేకంగా సర్వీసురోడ్డు నిర్మితం చేయించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ మిథున్‌రెడ్డి ఇది వరకే వైఎస్సార్‌సీపీ నేతలు కోరిన సంగతి తెలిసిందే.

- కడప–రేణిగుంట హైవేలో రోజురోజుకు ట్రాఫిక్ పెరుగుతోంది. ఈ మార్గం మీదుగా తిరుపతి, చెన్నై, ముంబై, హైదరాబాద్‌లకు రాకపోకలు జరుగుతున్నా యి. నిత్యం 17వేలకు పైగా వాహనాలు హైవేపై పరుగులు తీస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్‌కు హైవే కెపాసిటీ సరిపోవడంలేదు. నాలుగులైన్లరోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ తగ్గి, సర్వీసురోడ్డుగా మారునున్న రహదారిలో ప్రమాదాలు తగ్గుముఖం పడతాయి.

రూ.4వేల కోట్ల కేటాయింపు

కడప–రేణిగుంట హైవే నిర్మాణానికి రూ.4వేల కోట్లు వివిధ పనుల రీత్యా కేటాయించింది. అయితే ప్రాజెక్టు వ్యయం మాత్రం రూ2,350 కోట్లుగా అంచనా వేశారు. గత ఏడాది జూలైలో కేంద్రమంత్రి గడ్కరీ శంకుస్థాపన చేశారు. కడప–రేణిగుంట ఫోర్‌లైన్ నిర్మాణరహదారిలో లక్ష్మీఇన్‌ఫ్రా నిర్మాణ సంస్థ పనులు చేపట్టేందుకు క్యాంప్‌లను సిద్ధం చేసుకుంటోంది.

- మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల నుంచి నిత్యం వేలాదిమంది ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన తిరుపతికి వస్తుంటారు. కడప–రేణిగుంట రహదారి ఎన్‌హెచ్ చేయడం వల్ల వీరు సఖంగా ప్రయాణం చేయడానికి వీలు కలుగుతుంది. కడప నుంచి ఒకటిన్నరగంటలో తిరుపతికి చేరుకోవచ్చు.

అటవీ అందాలతో..



716 కడప–రేణిగుంట జాతీయరహదారి. అడవి అందాలతో ముడివేసుకున్న ప్రయాణం హాయిగా కొనసాగనుంది. రాయలసీమ జిల్లాలకు ముఖ్య రహదారి అయినందున దీనిని త్వరగా పూర్తిచేయాలని కేంద్రం యోచిస్తోంది. ఆ దిశగా కేంద్రం అనుమతులు ఇచ్చింది.

నియంతను తలపిస్తున్న చంద్రబాబు

- కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేయాలి
- వైఎస్‌ఆర్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



జిల్లా పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. చిత్రంలో పార్టీ సీనియర్ నాయకులు

రాయచోటి: రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని, చంద్రబాబు నియంతను తలపిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. రాయచోటిలో శుక్రవారం జిల్లా వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పార్టీ సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏడాది పాలన వైఫల్యాలను ఎండగట్టారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కంటే మెరుగ్గా పథకాలను అందిస్తామని చంద్రబాబు ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో మోసపోయిన రాష్ట్ర ప్రజలు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని అయన అన్నారు.ఎన్నికల హామీలను నెరవేర్చాలని ఎవరైనా అడిగితే మీ నాలుక మందం అయిందని చంద్రబాబు అనడం విడ్డూరంగా ఉందన్నారు. కరోనా సమయంలోనూ అప్పటి సీఎం జగన్ ఏ సంక్షేమ పథకాన్ని నిలుపుదల చేయకుండా వంద శాతం హామీలను నెరవేర్చారన్నారు. ప్రజలకు నేరుగా రూ.3 లక్షల కోట్ల నిధులను అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. మాట తప్పడం చంద్రబాబు నైజం అన్నారు. 2014 సమయంలోనూ జాబు రావాలంటే బాబు రావాలని ఊదరగొట్టారని, అధికారంలోకి వచ్చిన తరువాత లక్షలాది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను తొలగించారని మాజీ మంత్రి గుర్తు చేశారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు గడప గడపకు వెళ్లి కూటమి పాలన వైఫల్యాలను తెలియపరుస్తూ గత వైసీపీ పాలనలో అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ సమన్వయకర్తలు, నాయకులు, వివిధ విభాగాల నాయకులు కార్యకర్తలకు సూచించారు. పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు అర్థం అవుతాయన్నారు. ఇదే విషయాన్ని ప్రజలకు వివరించి జగన్ మోహన్ రెడ్డి పాలనకు, కూటమి నయవంచన పాలనకు ఉన్న తేడాలను ప్రజలకు వివరించాలన్నారు. జిల్లా రాజకీయాలలో మంచి ప్రాధాన్యం కలిగిన సుగవాసి కుటుంబం నుంచి వచ్చిన బాలసుబ్రమణ్యం ఎటువంటి పదవులు ఆశించకుండా పార్టీలో చేరడం సంతోషమన్నారు. జిల్లాలో పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. పార్టీలో ఆయనకు మంచి ప్రాధాన్యత, భవిష్యత్తు ఉంటాయని మాజీ మంత్రి చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, సుగవాసి సుబ్రమణ్యం, నిస్సార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు

- సూపర్ సిక్స్‌తో పాటు 146 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒకటి రెండు మినహా ఏ ఒక్కటీ అమలు చేయలేదని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్‌లపై కూడా కూడా అక్రమ కేసులు పెట్టి వేధించడం దారుణం అన్నారు. లక్కిరెడ్డిపల్లి మండలంలో ఎన్నికల సమయంలో టపాసులు పేలి కన్ను దెబ్బతిందన్న నెపంతో మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిలతో సహా 19 మందిపై అక్రమ కేసులు నమోదు చేశారన్నారు. బద్వేలులో శ్రీకాంత్ రెడ్డి అనే పార్టీ వర్గీయుడి ఇంటిని అక్రమంగా కూల్చేశారన్నారు. మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటున్న టీడీపీ నేతలు ప్రజల వద్దకు వస్తారని, ఏఏ హామీలు నెరవేర్చారో చెప్పే వరకు ఎక్కడికక్కడ ప్రజలు నిలదీయాలన్నారు.
- జగన్ ప్రజాక్షేత్రంలోకి వస్తుంటే టీడీపీకి గుండెలు అదురుతున్నాయని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. రాష్ట్రంలో జగన్‌కు రోజు రోజుకూ ప్రజాదరణ పెరుగుతోందన్నారు. ప్రతి వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్త జగన్ అడుగుజాడల్లో అడుగేసి పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా కూటమి పాలనపై వ్యతిరేకత వినిపిస్తోందన్నారు. ఇదే విషయాన్ని పార్టీ ఆదేశానుసారం ప్రజలలోకి వెళ్లి కూటమి పాలన వైఫల్యాలను ప్రజలకు వివరిద్దామని చెప్పారు.
- చంద్రబాబు పాలనపై రోజు రోజుకూ ప్రజా వ్యతిరేకత పెరుగుతోందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. పల్లెలు, పట్టణాలలో ఎక్కడకు వెళ్లినా టీడీపీకి ఓటు వేసి తప్పు చేశామని ప్రజలే నిర్భయంగా చెబుతున్నారన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వ వైఫల్యాలను వైఎస్‌ఆర్‌సీపీ శ్రేణులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కోరారు. 2029లో వైఎస్ జగన్ సీఎం కావడం తథ్యం అని అన్నారు.
- కూటమి పాలనలో రైతుల పరిస్థితి దీనంగా మారిందని మదనపల్లె ఇన్‌చార్జి నిస్సార్‌అహమ్మద్ ధ్వజమెత్తారు. కూటమి నాయకుల స్వప్రయోజనాలు తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. మామిడి, టమోటా రైతులకు గిట్టుబాటు ధరలు లేక పూర్తిగా నష్టపోయారన్నారు. రాబోయే రోజుల్లో జగన్ 2.0లో కార్యకర్తలకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు.
- చంద్రబాబు పాలనలో ధన ఉన్మాదం రాజ్యమేలుతోందని జెడ్పీ మాజీ చైర్మన్, ఇటీవల టీడీపీని వీడి వైఎస్‌ఆర్‌సీపీలో చేరిన సుగవాసి బాలసుబ్రమణ్యం ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు జరగడం లేదని ఆ పార్టీల్లో ని 164 శాసనసభ్యులలో ఎవరైనా కాణిపాకంలో ప్రమాణం చేస్తారా అని సవాల్ విసిరారు. అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని నేను ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పినవవి ఒకటి, అధికారంలోకి వచ్చిన తరువాత ఇంకొకటి చేస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనలో జరుగుతున్న అన్యాయాలపై ప్రజలను మేలుకొలపాలన్నారు. మీలో ఒక్కడిగా, తోడుగా ఉండి వైఎస్‌ఆర్‌సీపీ విజయానికి కృషి చేస్తానని బాలసుబ్రమణ్యం ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఏపీఎండీసీ మాజీ ఛైర్‌పర్సన్, వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు షమీంఅస్లాం, జిల్లా మహిళా నాయకురాళ్లు అజంతమ్మ, మహిత తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో సంక్షేమం.. అభివృద్ధి లేదు: రాజ్యసభ సభ్యుడు మేడా

కూటమి పాలనలో సంక్షేమం..అభివృద్ధి లేవని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి అన్నారు. సంపద సృష్టిస్తామని తరచూ చెప్పే ముఖ్యమంత్రి చంద్రబాబు తన నారా కుటుంబానికి, తన కోటరీ వాళ్లకు మాత్రమే సంపద సృష్టిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయమని అడిగిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ దౌర్జన్యకర పాలనకు తెరతీశారన్నారు. ప్రజల సంక్షేమం కోసం వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు కూటమి ప్రభుత్వంపై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

పంజం సుకుమార్ రెడ్డి మృతి తీరనిలోటు



నివాళులు అర్పిస్తున్న టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



పంజం సుకుమార్ రెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజం సుకుమార్‌రెడ్డి (64) ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. అనారోగ్యంతో చెన్నైలో శుక్రవారం పంజం సుకుమార్‌రెడ్డి మృతిచెందిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి.. మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి తదితరులు అనంతరాజుపేటలో పంజం మృతదేహాన్ని సందర్శించారు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. 40 ఏళ్లుగా క్రియాశీలక రాజకీయాల్లో చురుగ్గా ఉన్న పంజం సుకుమార్ రెడ్డి గత ప్రభుత్వంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్‌గా, డీఆర్‌యూసీసీ సభ్యుడిగా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, అనంతరాజుపేట సర్పంచ్‌గా, ప్రైవేట్‌స్కూల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పలు పదవులు చేపట్టారు. తనదైన శైలిలో వాటికి వన్నె తెచ్చారు. వైఎస్సార్ కుటుంబం వెంట నడుస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు.

ప్రముఖుల నివాళి

పంజం సుకుమార్‌రెడ్డి మృతి విషయం తెలుసుకున్న టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ రాష్ట్ర నాయకులు భూమన కరుణాకర్‌రెడ్డి, 'సాక్షి' ఎడిటర్ రక్కసి ధనుంజయ రెడ్డి, మాజీఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, భూమన అభినయ్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, వత్తలూరు సాయికిశోర్‌రెడ్డి, చెవ్వ శ్రీనివాసులురెడ్డి తదితర నాయకులు పంజం స్వగ్రామానికి చేరుకున్నారు. సుకుమార్‌రెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముస్తాక్, సీనియర్ నాయకులు కుమార్ రెడ్డి, రామనాథంలు పంజం సుకుమార్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

నేడు అంత్యక్రియలు: వైఎస్సార్‌సీపీ నాయకులు పంజంసుకుమార్‌రెడ్డి భౌతికకాయానికి శనివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాగా, మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం ఉదయం అనంతరాజుపేటకు రానున్నారు. పంజం మృతదేహానికి నివాళులు అర్పించనున్నారు.

క్లుప్తంగా

ఒకరికి తీవ్ర గాయాలు

రామసముద్రం : రామసముద్రం మండలం దాసర్లపల్లి సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రామసముద్రం బోయ వీధికి చెందిన అశోక్ కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం రామసముద్రం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాందేవ్ బాబాకు స్థలం కేటాయింపు రద్దు చేయాలి

రాయచోటి టౌన్ : హార్సిలీ హిల్స్ ప్రాంతంలో రాందేవ్ బాబాకు స్థలాన్ని కేటాయించరాదని, దానిని వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలియచేశారు. ప్రకృతి సంపదలను కార్పొరేట్ సంస్థల చేతిలోకి మళ్లించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా వివాదాస్పదంగా నిలిచిన రాందేవ్ బాబాకు కేటాయించిన భూమిని వెనక్కు తీసుకోవాలని కోరారు. ఆస్తులకు అప్పగించేటప్పుడు జిల్లా ప్రజల అభిప్రాయాన్ని తీసుకోవాలని సూచించారు.

పోక్సో కేసు నమోదు చేయాలి

జమ్మలమడుగు : పెద్దముడియం మండలం జంగాలపల్లిలో ఉన్న పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న మస్తాన్ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఉన్నాడని, ఉన్నతాధికారులు అతనిని వెంటనే సస్పెన్షన్ చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఆ టీచర్‌పై విచారణ జరిపించాలని జమ్మలమడుగు ఎంఈఓ కు వినతి పత్రం సమర్పించారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం

- ప్రారంభమైన మొహర్రం కార్యక్రమాలు
- జిల్లా వ్యాప్తంగా కొలువుదీరిన పీర్లు
- గ్రామాల్లో సందడి వాతావరణం



రాజంపేట పట్టణంలోని నాగులమాను వీధిలో కొలువైన పీర్లు

రాజంపేట టౌన్ : ఇస్లాం క్యాలెండర్ ప్రకారం గురువారం రాత్రి నెలవంక దర్శనమివ్వడంతో నూతన సంవత్సరం ప్రారంభమైంది. మొదటి నెల మొహర్రం కావడంతో హజ్రత్ ఇమామ్ హుస్సేన్ బలిదానం జ్ఞాపకార్థం పదిరోజుల పాటు సంతాప కార్యక్రమాలు జరుపుకుంటారు. అందువల్ల శుక్రవారం జిల్లాలోని వివిధ పట్టణాల్లో అనేక గ్రామాల్లో పీర్ల చావిడిలలో పీర్లను కొలువుదీర్చారు. ఇదిలావుంటే మొహర్రం నెలలోనే ఇస్లాం మత ప్రవక్త మహమ్మద్ రసూలల్లా సొల్లేల్లాహు అలైహి వసల్లం మనవళ్లు ఇస్లాం మత వ్యాప్తి కోసం కర్బాలా మైదానం (సౌదీ)లో పది రోజుల పాటు యుద్ధం చేశారు. ఈ యుద్ధంలో వారి వంశానికి చెందిన 72 మంది అసువులు బాసి వీరమరణం పొందారు. వారిని స్మరించటానికి ప్రతి ఏడాది మొహర్రం నెలలో పది రోజుల పాటు కార్యక్రమాలు చేస్తారు. అందులో భాగంగా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పీర్లు కొలువుదీరాయి. ఈసందర్భంగా పీర్లను కొలిచే వారు చదివింపులు చేసి ప్రార్థనలు చేస్తారు.

మత సామరస్యానికి ప్రతీక..

మొహర్రం మత సామరస్యానికి ప్రతీక అని చెప్పాలి. అనేక గ్రామాల్లో మొహర్రం ను హిందువులే ముందు ఉండి జరిపిస్తారు. కొన్ని గ్రామాల్లో హిందువుల ఇంటి నుంచి పీర్లు వెళ్ళడం, కొన్ని సాంప్రదాయమైన కార్యక్రమాలు సైతం హిందువులే చేపడతారు. ఈ సాంప్రదాయాలన్నీ కూడా అనాదిగా వస్తున్నాయి. పీర్ల పండుగను పురస్కరించుకొని చేపట్టే సాంప్రదాయమైన కార్యక్రమాలను హిందు, ముస్లింలు గౌరవంగా కూడా భావిస్తారు. ఇక ధనవంతులు పీర్ల వేడుకకు లక్షలాది రూపాయిలు కూడా వెచ్చిస్తారు. ఈసందర్భంగా ప్రజా ప్రతినిధులను, రాజకీయ నాయకులను సైతం ఆహ్వానించి అట్టహాసంగా పీర్ల పండుగ నిర్వహిస్తారు.

గ్రామాల్లో కోలాహల వాతావరణం

మొహర్రం సందర్భంగా పట్టణాల్లోకంటే గ్రామీణ ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. పలు ప్రాంతాల్లో పీర్ల వేడుకలను అట్టహాసంగా నిర్వహిస్తారు. అందువల్ల ఆయా గ్రామాల ప్రజలు తమ బంధువులను, మిత్రులను, ఆత్మీయులను సైతం మొహర్రంకు ఆహ్వానిస్తారు. ఇక ప్రజలు ఒక కుటుంబ సభ్యుల్లా రాత్రి వేళల్లో పీర్లచావిడి వద్దకు చేరి సాంప్రదాయమైన కార్యక్రమాలు చేపడతారు. పీర్లను ఊరేగించే సమయంలో యువత ఆనందానికి ఆకాశమే హద్దు అన్న విధంగా ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో నిత్యం అన్నదాన కార్యక్రమాలు చేపడతారు. అలాగే నిత్యం రాత్రి వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. అందువల్ల మొహర్రం నిర్వహించే గ్రామీణ ప్రాంతాల్లో పదిరోజుల పాటు సందడి వాతావరణం నెలకొంటుంది.

కాల్‌మనీ వేధింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాల్‌మనీ బాధితులు, సీపీఎం నాయకులు

రాయచోటి జగదాంబసెంటర్ : కాల్‌మనీ పేరుతో వేధింపులకు పాల్పడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు కాల్ మనీ వేధింపుల బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ మదనపల్లి పట్టణంలో ఏకాంబరంరెడ్డి, ఖాదర్‌వల్లి, ఆనంద్, అనురాధ అనేవారు ఒంటరి మహిళలను టార్గెట్ చేసి అప్పులు ఇచ్చి వారి చేత ఖాళీ చెక్కులు, బాండ్లు తీసుకుని అత్యధిక వడ్డీలు వసూలు చేయడమే కాకుండా, తీవ్రమైన వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాల్‌మనీ విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరు అనుమానాస్పదంగా ఉందని అన్నారు. అత్యధిక వడ్డీలు, వేధింపులు తట్టుకోలేక గౌరీ లాంటి వారు బహిరంగ ప్రకటన చేయగలిగారు కానీ, చాలా మంది బయటకు చెప్పుకోలేని పరిస్థితి ఉందని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ మోసపూరితంగా ఉండే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఖాళీ చెక్కులు, బాండ్లు ఇవ్వకూడదని సూచించారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌కు ఫోన్‌చేసి కాల్‌మనీ వేధింపులకు పాల్పడుతున్న వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాల్ మనీ బాధితులు గౌరీ, సుజాతలతో పాటు సీపీఎం నాయకులు రామాంజులు, రామచంద్ర, మాధవ తదితరులు పాల్గొన్నారు.

భర్త పట్టించుకోవడం లేదు

- ముగ్గురు పిల్లల పోషణ భారంగా మారింది
- కుమార్తెల చదువూ ఆగిపోయేలా ఉంది
- న్యాయం చేయండి అంటూ పోలీస్ స్టేషన్‌లో మహిళ ఫిర్యాదు

జమ్మలమడుగు : 'నా భర్త జైపాల్ రెడ్డి ముగ్గురు సంతానం కలిగిన తర్వాత మమ్మల్ని వదిలిపెట్టి మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని నా బంగారు నగల్ని, ఆస్తులన్నింటినీ ఆమెకు ఇచ్చాడని.. నన్ను, నా ముగ్గురు ఆడపిల్లల్ని రోడ్డున పడేశాడు. మాకు న్యాయం చేయండి' అంటూ బాధితురాలు స్వర్ణలత ఆవేదన వ్యక్తం చేసింది. శుక్రవారం ఎర్రగుంట్ల పట్టణంలోని కడప రోడ్డులో తన కుమార్తెలతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. '16 సంవత్సరాల క్రితం జైపాల్‌రెడ్డితో నాకు వివాహం జరిగింది. మాకు ముగ్గురు కుమార్తెలు. గీత, పావని, ప్రసన్న. కుటుంబంలో ఎటువంటి సమస్యలు లేకపోవడంతో జీవనం ప్రశాంతంగా సాగింది. అయితే ఇటీవల కొంత కాలం నుంచి మరో మహిళతో నా భర్త అక్రమ సంబంధం పెట్టుకని తమని పట్టించుకోవడం మానేశాడు. ఇంటికి కూడా రావడంలేదు. విషయం తెలియడంతో నా భర్తను నిలదీశాను.. ఇలా పిల్లల్నివదిలిపోతే ఎలా అంటూ ప్రశ్నించాను. అయితే మీరు నాకు అవసరం లేదని.. నేను ఉంచుకున్న దాంతోనే ఉంటానని చెప్పి వెళ్లిపోయాడు. ముగ్గురు ఆడపిల్లలతో ఏం చేయాలో నాకు దిక్కుతోచడం లేదు. పిల్లల పోషణ భారం అవుతోంది. పిల్లల చదువులు ఆగిపోయే పరిస్థితి ఉంది. నా భర్త తమ కుటుంబాన్ని పోషించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.. న్యాయం చేయండి.. లేకపోతే పిల్లలతో సహా ఆత్మహత్య ఒక్కటే శరణ్యం' అంటూ స్వర్ణలత కన్నీటి పర్యంతైమంది. ఈ మేరకు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది.

బహిరంగ ప్రకటన

శ్రీమతి ఎన్.రేణుకారెడ్డి వారు సర్వే నెం.350లో 6.0 హెక్టార్ల విస్తీర్ణంలో మదనపల్లి గ్రామం, మదనపల్లి మండలము, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్ పర్యావరణ అనుమతుల యొక్క ఆర్డరు నెం.SE/AA/AP/MIN/EC/AM/05/2025/1421/264.14 & 264.07, తేది: 24.06.2025 కలర్ గ్రానైట్ మైన్ కొరకు అనుమతులు పొందియున్నారు. ఆ పత్రులు పర్యావరణ అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (MoEF&CC) వెబ్‌సైట్ నందు లభించును

సం॥ శ్రీమతి ఎన్.రేణుకారెడ్డి

ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అరెస్ట్ రాజ్యాంగ విరుద్ధం

రాయచోటి : అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడం రాజ్యాంగ విరుద్ధమని వైఎస్ఆర్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటిలో రవీంద్రారెడ్డి పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో అరెస్టుపై స్పందించారు. లక్కిరెడ్డిపల్లె మండలం కుర్నూతల అగ్రహారం గ్రామానికి చెందిన లోకేష్ నాడు వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఎన్నికల సందర్భంగా ప్రచార నిమిత్తం తన గ్రామానికి వెళ్లినప్పుడు స్వాగతం పలకడంలో భాగంగా అతనే స్వయంగా బాణసంచా కాల్చాడన్నారు. ఆ క్రమంలో అతని కంటి వద్ద గాయం అయిందన్నారు. వెంటనే వైఎస్ఆర్‌సీపీ నాయకులు రూ.3 లక్షలు ఆర్థికసహాయం కూడా చేశారన్నారు. ఈ సంఘటన జరిగిన 14 నెలల తర్వాత తాను పేల్చిన బాణసంచా కారణంగా గాయమైతే నేడు లోకేష్‌ను టీడీపీలో చేర్చుకుని వైఎస్ఆర్‌సీపీ నాయకులు డిటోనేటర్లు పేల్చి గాయపరిచినట్లు కుట్రపూరితంగా అతని ద్వారా మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. ఆ సందర్భంలో అక్కడ లేనటువంటి రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేరు కూడా కేసులో చేర్చడంతో పాటు మాజీ ఎమ్మెల్యే రమేష్ రెడ్డి, ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డితో పాటు 19 మందిపై కేసులు పెట్టడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

కారు ఢీ - వ్యవసాయ కూలి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నారాయణ

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లి పంచాయతీ, అమృతవారిపల్లి జాతీయ రహదారిపై వెనుక నుండి కారు ఢీ కొనడంతో గుండ్ల నారాయణ (40) అనే వ్యవసాయ కూలి శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పంచాయతీలోని ముక్కావారిపల్లి దళితవాడకు చెందిన గుండ్ల నారాయణ కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజూ వలే ముక్కావారిపల్లికి జాతీయ రహదారి పక్క నుండి నడుచుకుంటూ వెళ్తుండగా పోరుమామిళ్ల నుండి తిరుపతికి వెళ్తున్న కారు వేగంగా ఢీ కొనడంతో నారాయణ తలకు తీవ్రంగా గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ మహేష్ నాయుడు తెలిపారు.

కారు ఢీ కొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారి చెన్నకేశవ స్వామి ఆలయం సమీపంలో స్కూటర్‌ను కారు ఢీ కొనడంతో ఈశ్వరయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మంగంపేట కాపుపల్లి దళితవాడ గ్రామానికి చెందిన ఈశ్వరయ్య తన పనులు ముగించుకొని ఇంటికి మోటార్ బైక్ వెళ్తుండగా చెన్నకేశవ స్వామి గుడి మలుపువద్ద కారు ఢీ కొంది. దీంతో క్రిందపడ్డ ఈశ్వరయ్యకు తలకు తీవ్ర గాయం కావడంతోపాటు చేతికి గాయం అయ్యింది. గాయపడిన వ్యక్తిని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టపాసుల కేసులో 19 మంది వైఎస్సార్‌సీపీ నేతలకు బెయిల్ మంజూరు

లక్కిరెడ్డిపల్లి : టపాసుల ఘటనలో అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లిలో అక్రమంగా నమోదు చేసిన కేసులో 19 మంది వైఎస్సార్‌సీపీ నేతలకు శుక్రవారం బెయిల్ మంజూరైంది. ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డితో పాటు మరో వ్యక్తి మండ్ల సుబ్బరాయుడుకి లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అలాగే మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్ రెడ్డి, రెడ్డప్పగారి రమేష్ కుమార్ రెడ్డితోపాటు మరో 15 మందికి శుక్రవారం హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

నకిలీ విలేకరిపై ఎస్పీకి ఫిర్యాదు



నకిలీ విలేకరి ఓబులేష్ యాదవ్ (ఫైల్)

కడప అర్బన్ : సింహాద్రిపురం, బ్రహ్మంగారిమఠం, రాజంపేట, గువ్వలచెరువు ప్రాంతాలలో టీవీ9 విలేకరి అంటూ బెదిరింపులకు దిగుతున్న పలుగురాళ్లపల్లె గ్రామానికి చెందిన ఓబులేష్ యాదవ్‌పై ఆ ఛానెల్ సిబ్బంది శుక్రవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

టీవీ9 పేరు చెప్పుకొని ఇతను చేసే వ్యవహారాలన్నీ ఉమ్మడి కడప జిల్లా సీనియర్ కరస్పాండెంట్ సుధీర్ కు సమాచారం అందడంతో ఈ విషయాన్ని ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే స్పందించిన ఎస్పీ బ్రహ్మంగారిమఠం పిఎస్ లో అతనిపై కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. ఓబులేష్ యాదవ్ అనే వ్యక్తి పై ఎస్పీకి వినతిపత్రం ఇచ్చిన వారిలో టీవీ9 కడప జిల్లా సిబ్బంది సురేష్ బాబు (ఏపీడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు) సురేష్ (జిల్లా కార్యవర్గ సభ్యుడు), సుబ్బారెడ్డి, కార్తీక్‌లు వున్నారు.

విద్యుత్ వాడకంపై అవగాహన పెంచుకోవాలి



ప్రజల అవగాహన కోసం ఏడు సూత్రాల పోస్టర్‌ను ఏర్పాటు చేసిన అధికారులు

రాయచోటి టౌన్ : విద్యుత్ వాడకంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రాయచోటి ట్రాన్స్‌కో డివిజన్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు ఆర్.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రాయచోటి విద్యుత్ డివిజన్ శాఖ కార్యాలయంలో విద్యుత్ భద్రతా వారోత్సవాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని అప్పుడే విద్యుత్ వినియోగంపై సరైన ప్రణాళిక ఉంటుందన్నారు. విద్యుత్ వాడకంలో అనేక సందర్భాలలో జాగ్రత్తలు పాటించకుండా ఉండటంతో ప్రమాదాలు జరుగుతుంటాయని, అలాగే అధిక విద్యుత్ వినియోగం చేస్తుంటామన్నారు. అనేక చోట్ల విద్యుత్ లైన్‌లు ఉన్నప్పటికీ ఆ లైన్ కిందనే ఇళ్ల నిర్మాణాలు చేస్తుంటారని, దీని వలన ప్రమాదాలు జరుగుతుంటాయని, కొన్ని సందర్భాలలో ప్రాణాలు కూడా కోల్పోతుంటారన్నారు. విద్యుత్ లైన్ కింద ఇళ్ల నిర్మాణాలు చేయరాదని సూచించారు. ఈ క్రమంలో ఏడు సూత్రాలు కలిగిన పోస్టర్ ప్రజల అవగాహన కోసం ప్రదర్శనకు ఏర్పాటు చేశారు.

ఖాజావలి కుటుంబానికి అండగా ఉంటాం



మృతుడు ఖాజావలి భార్యకు నగదు అందజేస్తున్న పోలీస్ శాఖ అధికారులు

రాయచోటి టౌన్ : భవనం పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాయపాటి ఖాజావలి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని అన్నమయ్య జిల్లా విద్యాసాగర్ నాయుడు అన్నారు. ఖాజావలి కడప పట్టణంలోని అశోక్ నగర్‌లో తన ఇంటిపై తన భార్యతో కలిసి తాల్పార్ పట్ట కప్పేప్రయత్నంలో ఇంటి పైకప్పు సిమెంట్ రేకులు పగిలి కిందపడ్డాడన్నారు. ఈ ప్రమాదంలో ఆయన తలకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించినప్పటికీ పరిస్థితి విషమించి మృతి చెందాడన్నారు. ఆయనకు భార్య మాబున్నిసాతో పాటు నలుగురు ఆడపిల్లలు కూడా ఉన్నారని తెలిపారు. వారి కుటుంబానికి పోలీస్ శాఖ అండ ఉంటుందని చెప్పారు. అంతకు ముందుగా పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. దహన సంస్కారాల కోసం రూ.1లక్ష నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యం. శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ యం. పెద్దయ్య, అన్నమయ్య, కడప పోలీసులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం వాడాలి

మదనపల్లె రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనానికి వంట నిర్వాహకులు సన్నబియ్యం మాత్రమే వాడాలని, పాత బియ్యం వాడవద్దని డీఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం మదనపల్లె పర్యటనలో భాగంగా ఆయన జెడ్పీహైస్కూల్, భవిత కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి పాఠశాలల్లో పాత బియ్యం నిల్వలు ఉంటే, జాయింట్ కలెక్టర్ నుంచి గైడ్‌లైన్స్ వచ్చేంతవరకు వాటిని అలాగే భద్రపరచాలన్నారు. పీఎం శ్రీ కింద మదనపల్లె జెడ్పీహైస్కూల్ భవిత కేంద్రంలో ఆటిజం సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. నాడు-నేడు పథకంలో పెండింగ్ పనులను పూర్తిచేయాల్సిందిగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. గతంలో అన్ని పాఠశాలకు ఒకే అజెండా ఉంటే.. ప్రస్తుతం ప్రైమరీ, సెకండరీకి వేర్వేరుగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకరరెడ్డి, రాజగోపాల్, ఐ.ఈ.కోఆర్డినేటర్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలోని ఏఆర్టీ కేంద్రం తనిఖీ



ఏఆర్టీసెంటర్లో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం అధికారి

మదనపల్లె రూరల్ : మదనపల్లెలోని జిల్లా ఆసుపత్రిలో ఉన్న ఏఆర్టీ, ఐసీటీసీ కేంద్రాలను జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం అధికారి వి. భాస్కర్ తనిఖీ చేశారు. శుక్రవారం ఏఆర్‌టీ,ఐసీటీసీ విభాగాల్లోని పలు రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్‌టీ, ఐసీటీసీ ద్వారా రోగులకు మరిన్ని వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఇదివరకు మదనపల్లె ప్రభుత్వాసుపత్రి ఏఆర్టీ కేంద్రాన్ని చిత్తూరు జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ విభాగం వారు తనిఖీలు చేసేవారని, ఇకపై కడప జిల్లా పరిధిలోకి ప్రభుత్వం మార్చిందన్నారు. ఆసుపత్రిలో హెచ్ఐవీ బాధితులకు అందుతున్న వైద్యసేవలు, అందుబాటులో ఉన్న మందులు, పరీక్షల కిట్లు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. కొన్ని రకాల కిట్లు కొరత ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రిలో రక్తనిధి కేంద్రాన్ని వేరే భవనంలోకి మార్చడంపై సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరితో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం జిల్లా అకౌంటెంట్ ఎస్. అప్రోజ్, ప్రోగ్రాం అధికారి అబ్దుల్ సాదిక్, ఐసీటీసీ సిబ్బంది జయకుమార్, పుల్లయ్యానాయుడు, దీప్తి పాల్గొన్నారు.

పరుగుల సునామీ సృష్టించిన కడప జట్టు

- 353 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మెన్ ప్రణీల్‌రెడ్డి
- 765 భారీ స్కోరు చేసిన కడప జట్టు



353 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మెన్ ప్రణీల్‌రెడ్డి



114 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మెన్ సుదర్శన్



221 పరుగులు చేసిన అనంతపురం బ్యాట్స్‌మెన్ జయంత్ కృష్ణ



157 పరుగులు చేసిన అనంతపురం బ్యాట్స్‌మెన్ కెహెచ్ వీరారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్-19 మల్టీ మ్యాచ్‌లో రెండవ రోజు కడప జట్టు పరుగుల సునామీ సృష్టించింది. వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో కడప జట్టు గెలుపు దిశగా పయనిస్తోంది.

తొలి ఇన్నింగ్స్‌లో 401 ఓవర్‌నైట్ స్కోర్‌తో శుక్రవారం రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు 175.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 765 పరుగులకు డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని ఆర్. ప్రణీల్ రెడ్డి తన బ్యాటింగ్‌తో విజృంభించి 477 బంతుల్లో 39 ఫోర్లతో 353 భారీ పరుగులు చేశాడు. టి.సుదర్శన్ 161 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లతో 114 పరుగులు చేశాడు, ఎస్. విష్ణు సాయి 68 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని మల్లిఖార్జున 2 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 7 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 14 పరుగులు చేసింది. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో..

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో 194 ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 77 ఓవర్లలో 524 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని ఎ. జయంత్ కృష్ణ 37 ఫోర్లు, 3 సిక్సర్లతో 221 అత్యధిక పరుగులు చేశాడు. కెహెచ్ వీరారెడ్డి 175 బంతుల్లో 157 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని తేజ 4 వికెట్లు, లోకేష్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 40 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసింది. ఆ జట్టులోని కారుణ్య ప్రసాద్ 72 పరుగులు చేశాడు.

రహదారి కబ్జాకు కూటమి నాయకుల యత్నం



రహదారి కబ్జా చేసేందుకు తీసుకొచ్చిన జేసీబీ



నాగేశ్వరరాజుకు తగిలిన గాయాలను చూపుతున్న కుమార్తెలు

రాజంపేట రూరల్ : ప్రభుత్వం అధికారంలోకి రాగానే కూటమి నాయకుల అరాచకాలకు, కబ్జాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందనేది బహిరంగ రహస్యం. తాము చేసేది చట్టం.. చెప్పిందే న్యాయంగా కూటమి నాయకుల తీరు కొనసాగుతుంది. అందుకు ఉదాహరణగా మండల పరిధిలోని ఊటుకూరు పంచాయతీలో శుక్రవారం పట్ట పగలు రహదారిని కబ్జా చేసేందుకు కూటమి నాయకులు ప్రయత్నించడాన్ని చెప్పుకోవచ్చు.

రహదారి కోసం పోరాటం..

ఊటుకూరు పంచాయతీలోని సర్వే నెంబరు 224, 225లలో గల 3 ఎకరాల పట్టా భూమిలోకి వెళ్లేందుకు రహదారి కోసం వైఎస్సార్‌సీపీ కార్యకర్త జగదాభి నాగేశ్వరరాజు కొన్ని సంవత్సరాలు పోరాటం చేశారు. చివరకు హై కోర్టు 2023లో నాగేశ్వరరాజుకు అనుకూలంగా రహదారి నిర్మాణం కోసం తీర్పునిచ్చింది. అదే విధంగా రెవిన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులు పలు పర్యాయాలు వివాద స్థలంను సందర్శించి అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి నాగేశ్వరరాజుకు రహదారిని నిర్మించుకునేందుకు అనుమతులు ఇచ్చారు. అధికారులతో పాటు పోలీసుల సమక్షంలో 2023లో రహదారిని నిర్మించుకున్నారు.

కబ్జాకు యత్నం..

రహదారిని నిర్మించిన స్థలం 1947 సర్వే నెంబరులోని 43 సెంట్లు ఆర్ఎస్ఆర్ ప్రకారం గయ్యాళీ పొరంబోకుది. కూటమి ప్రభుత్వంకు చెందిన చేజర్ల వాసుదేవరాజు ఈ స్థలంను కబ్జా చేసుకునేందుకు దౌర్జన్యంకు యత్నించారు. శుక్రవారం ఉదయం పాత రహదారిపై జేసీబీని ఉంచి వాసుదేవరాజు అతని మనుషులు మాటు వేసి ఉన్నారు. పొలంలో ఉన్న నాగేశ్వరరాజు ఇంటికి వెళ్లగానే రహదారిని జేసీబీతో తొలగించాలనేది వారి పన్నాగం. అయితే పొలం నుంచి తమ ఇంటికి వెళతున్న నాగేశ్వరరాజు జేసీబీ ఆగి ఉండటం చూసి అనుమానం వచ్చి జేసీబీ డ్రైవర్‌ను నిలదీయగా పొంతన లేని సమాధానాలు చెప్పసాగాడు. అనంతరం మాటు వేసిన వాసుదేవరాజు అతని మనుషలను చూపించాడు.

దౌర్జన్యం ఆపై దాడి..

విషయం బయట పడటంతో మాటు వేసిన వాసుదేవరాజు అతని మనుషులు దాదాపు 20 మంది జేసీబీ వద్దకు వచ్చి నాగేశ్వరరాజుతో వాగ్వివాదంకు దిగారు. నాగేశ్వరరాజు జేసీబీకి అడ్డు పడటంతో మూకుమ్మడిగా దౌర్జన్యంచేసి ఆపై విచక్షణా రహితంగా దాడి చేసి గాయ పరిచారు. సమాచారం అందుకున్న మన్నూరు పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వచ్చి మందలించటంతో వాసుదేవరాజు వర్గం తగ్గింది. ప్రాణాపాయం తప్పి తీవ్ర గాయాల పాలైన నాగేశ్వరరాజును వారి కుటుంబ సభ్యులు పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న నాగేశ్వరరాజును మన్నూరు సీఐ కుళాయప్ప తన సిబ్బందితో వచ్చి వివరాలు అడిగి తెలుసుకొని ఫిర్యాదు స్వీకరించారు. తనకు వాసుదేవరాజు వలన ప్రాణహాని ఉందన్నారు.

వ్యవసాయమే ఆధారం..

నాకు ఉన్న 3 ఎకరాలే నాకు జీవనాధారం. నాకు ఉన్నది ముగ్గురు అమ్మాయిలే. నాకు ఎవరు లేరు. నాకు వ్యవసాయమే ఆధారం. నా పిల్లలను పోషించాలన్నా నేను జీవించాలన్నా ఆ పొలమే దిక్కు. ఆ భూమికి దారి లేకుంటే మా కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకోవాల్సిందే. దయతో ఉన్నత అధికారులు స్పందించి తమ పొలంకు ఉన్న రహదారి కబ్జా కాకుండా కాపాడాలని నాగేశ్వరరాజు వేడుకుంటున్నాడు.